క్లుప్తంగా

సీఐగా వినోద్‌బాబు

చింతపల్లి: చింతపల్లి సీఐగా వినోద్‌బాబును నియమించారు. ఈయన అనకాపల్లి జిల్లా సైబర్ క్రైం విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఈయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన రమేష్‌ను విశాఖపట్నం వీఆర్‌కు అటాచ్ చేస్తూ రేంజ్ డిఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐగా వినోద్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సీతమ్మ

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ చెరువుపాకల గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎంపీపీ సీతమ్మ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్డు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామన్నారు. ప్రజా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సర్పంచ్ శివశంకర్, వార్డు సభ్యుడు కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నేత జయదేవ్ పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా అందజేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో డీఆర్ డిపోను సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు సందర్శించారు. అనంతరం గ్రామంలో రేషన్ పంపిణీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ పంపిణీదారులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. వారికి సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విశ్రాంతి భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యులు

హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో దాతల ఆర్థిక సాయంతో నిర్మించిన విశ్రాంతి భవనం, ఆలయ పూజారి నివాస గృహాన్ని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు లకే చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యులు పరదాని భీమలింగేశ్వరరావు, కొర్ర నాగరాజు, నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు అందించిన సేవలను కొనియాడారు. గ్రామంలో పలు ఆధ్యాత్మికత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోని మద్యం దుకాణాలను తొలగించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని మద్యం షాపులను ప్రజలకు ఇబ్బందులు లేని ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నేతలు చిన్నబాబు, మగ్గన్నలు తెలిపారు. వారు ఆదివారం మాట్లాడుతూ జనావాసాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మద్యం దుకాణాలను వేరే ప్రాంతాలకు తరలించాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు జగన్నాథం, హరి పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు కార్తీక శోభ

- ముస్తాబైన ఆలయాలు
- కార్తీక మాసం తొలి సోమవారం పూజలకు పూర్తయిన ఏర్పాట్లు



అరకులోయలోని శివాలయంలో ప్రత్యేకాలంకరణలో మల్లేశ్వర స్వామి విగ్రహం



పాడేరులోని ఆలయంలో ప్రత్యేకాలంకరణలో ఉమానీలకంఠేశ్వరస్వామి



పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా శివాలయాలకు కార్తీక శోభ నెలకొంది. కార్తీకమాసం పూజలకు శైవ క్షేత్రాలు, శివాలయాలను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణలో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని పవిత్ర మత్స్యగుండంతో పాటు అన్ని శివాలయాల్లోను కార్తీక మాసం పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పాడేరులోని పురాతన ఉమానీలకంఠేశ్వరస్వామి, పాతపాడేరులోని పురాతన ఈశ్వర నిలయం, స్వయంభూ త్రిలింగేశ్వరస్వామి, లగిశపల్లి, వంజంగి, తురాయిమెట్ట, తామరాపల్లి, సంగోడి, గెడ్డంపుట్టు, వంతాడపల్లి శివాలయాల్లోను కార్తీకమాసం తొలి సోమవారం పూజలు ఘనంగా జరగనున్నాయి.

అరకులోయటౌన్: అరకులోయలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవాలయం కార్తీక మాస పూజలకు ముస్తాబు చేశారు. ఆలయంలో ఈ నెల 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 26న శివ పార్వతుల కల్యాణం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరగనున్నట్టు తెలిపారు. ఈ నెల 29న మాస శివరాత్రి, సాయంత్రం 4 గంటలకు ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు వెంకన్న తెలిపారు.

ముంచంగిపుట్టు: మండలంలోని దార్రెల, చెరువుపాకల, జోలాపుట్టు, కర్రిముఖిపుట్టు, కిలగాడ గ్రామాల్లో శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం తొలి సోమవారం పూజలకు సిద్ధం చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలో పూజా సామగ్రీల దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీక మాస పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసంలో భక్తుల తాకిడి ఉంటుంది. కోరిన కోర్కెలు తీర్చే మల్లికార్జునుడిగా ఈ ఆలయానికి పేరుంది. మహాశివరాత్రికి ఇక్కడి ఆలయం వద్ద జాతర నిర్వహిస్తారు. ఈ ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. 18వ శతాబ్దం నుంచి ఈ ఆలయం ఉన్నట్టు గ్రామ పెద్దలు చెబుతారు. ఈ ఆలయ సమీపంలో పంచ పాండవుల విగ్రహాలు, పూర్వం రాజులకాలం నాటి చారిత్రక ఆనవాళ్లతో కూడిన రాతి విగ్రహాలు, కోటలు ఉన్నాయి.

వై.రామవరం: మండలంలోని పూతిగుంట పరమేశ్వరుని, గురమంద విశ్వనాథుని ఆలయాల్లో కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు చేశారు. ఆలయాల ఎదుట ఉన్న జలపాతాల్లో వందలాది మంది మహిళలు కార్తీక దీపాలు వదిలి, శివున్ని దర్శించుకోనున్నారు. ఈ రెండు ఆలయాలు దేవతల కాలం నాటివని, మహిమలు గలవని గ్రామ పెద్దలు చెబుతారు. అయ్యప్ప, సత్యదేవ భక్తులతో ఈ ఆలయాలు కళకళలాడుతున్నాయి.



గూడెంకొత్తవీధిలోని మల్లికార్జునస్వామి ఆలయంలో పురాతన విగ్రహాలు



విద్యుత్ దీపాలంకరణలో అరకులోయలోని శివాలయం



దార్రెలలో పూజలకు సిద్ధమైన శివాలయం



గురమంద విశ్వనాథుని ఆలయంలో భక్తులు

మోదకొండమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. కార్తీక మాసంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల తాకిడి నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యాన్నదానంలో భాగంగా ఆలయ కమిటీ భక్తులతో పాటు స్థానికులకు మధ్యాహ్నం ఉచిత భోజనాలను పంపిణీ చేశారు. ఎస్.కోటకు చెందిన టి.బాలకృష్ణ, పాడేరుకు చెందిన కె.చంద్రశేఖర్, శిరీషా, శ్రీనాథ్ మణికంఠ, సోమిశెట్టి లక్ష్మి తదితర భక్తులుఅన్నసమారాధనకు సాయమందించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, కమిటీ సభ్యులు వెంకటరమణ, చంద్రమోహన్, ఈశ్వరరావు, రాంబాబు, శంకరరావు, హరిబాబు, రత్నాబాయి, దేవుడు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దొరగూడ రహదారికి మోక్షం

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ అత్యంత మారుమూల దొరగూడ గ్రామంలో రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఉబ్బెంగుల గ్రామం నుంచి దొరగూడ వరకు 6 కిలోమీటర్లు మేరకు కొండలను పోక్లెయిన్‌తో తవ్వి మట్టి చదును పనులు చేస్తున్నారు. గతంలో వేసిన మట్టి రోడ్డు ఇటీవల వర్షాలకు పాడైపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో రోగులను, గర్భిణులను డోలీ మోతతో ఆస్పత్రికి తరలించే పరిస్థితి నెలకొంది. అయితే ప్రస్తుతం రహదారి పనులు జరుగుతుండడంతో దొరగూడ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మట్టి రోడ్డు పనులు వేగంగా పూర్తి చేసి, తారురోడ్డు వేసి రవాణా కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు.

శిథిలావస్థలో డీఆర్ డిపో



శిథిలావస్థకు చేరుకున్న లక్ష్మీపేట డీఆర్ డిపో భవనం

పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట డీఆర్ డిపో భవనం శిథిలావస్థకు చేరుకుంది. లక్ష్మీపేట పంచాయతీ సంబంధించి లబ్ధిదారుల రేషన్ సరకులను ఇక్కడ నిల్వ చేస్తుంటారు. డిపో పైకప్పు రేకులు పాడవడంతో వర్షం పడితే నీరు కారుతోందని, సరకులు తడిసిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో డిపో భవనం వినియోగంలో లేదని, ఓ అద్దె ఇంట్లో కొనసాగుతుందని చెబుతున్నారు. ప్రభుత్వం, జీసీసీ అధికారులు స్పందించి భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకుని రావాలని వారు కోరుతున్నారు. ఇదే పరిస్థితిలో మండలంలోని మరిన్ని డిపోలు ఉన్నాయి. ఈ విషయంపై స్థానిక జీసీసీ మేనేజర్ గాసి మాట్లాడుతూ డిపో భవనం శిథిలావస్థలో ఉందని, మండలంలో మరిన్ని భవనాలు ఇదే పరిస్థితిలో ఉన్నాయని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిపారు.

ఫిజియోథెరపీ వైద్య శిబిరం నేడు

అరకులోయ రూరల్: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పెదలబుడు పంచాయతీ ఈవో రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పెదలబుడు పంచాయతీలోని గ్రామ సచివాలయం-1, గ్రామ సచివాలయం-2, గ్రామ సచివాలయం-3 పరిధిలో ఉన్న గ్రామస్తులకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతున్నట్టు ప్రకటించారు. దివ్యాంగులకు పలు పరికరాలు అందజేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

ఈ-కేవైసీ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి



ఉషారాణి, ఎంపీపీ

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో ఈ-కేవైసీ కేంద్రం అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి చెప్పారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అరకులోయ మండల పరిధిలోని వంటగ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎస్.కోట, మాడుగుల, అనంతగిరి, అరకులోయల నుంచి వస్తున్న గ్యాస్ డీలర్లు ఈ-కేవైసీ సక్రమంగా చేయకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ-కేవైసీ నమోదుకాకపోవడంతో సిలిండర్లు పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో ఈ-కేవైసీ కేంద్రం ఏర్పాటుచేసి, సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు.

ఘనంగా భగినీ హస్త భోజనం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాక్షి,పాడేరు: పవిత్రమైన సోదర, సోదరి బంధానికి ప్రతీకగా నిలిచే భగినీ హస్త భోజనం కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీలు ఆదివారం స్థానిక టీటీడీ మండపంలోని ఓం శాంతి ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, తుంపాడ ఎంపీటీసీ నరసింహమూర్తి, కుజ్జెలి సర్పంచ్ చిట్టిబాబు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు శివరాత్రి శ్రీనివాసరావు, రత్నం, దేముడు, రాజబాబు, వర్తక సంఘం నేతలు అనిల్, మూర్తి, సన్యాసిరావు, గోవిందరావు, హెచ్ఎంలు కొండలరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ తనూజరాణికి అభినందనలు



అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణిని అభినందిస్తున్న అరకు పాస్టర్లు

సాక్షి, పాడేరు: అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజరాణిని అరకు పాస్టర్ల ఫెలోషిప్ ప్రతినిధులు ఆదివారం పాడేరులోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె ఇటీవల భారత రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కమిటీలో ఎంపీ సభ్యురాలిగా నియమితులు కావడంతో వారంతా అభినందించి, పూలమాలలు అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అరకు ఎంపీగా విజయం సాధించి పార్లమెంట్‌లో మన్య ప్రాంత, గిరిజనుల సమస్యలను ప్రస్తావించడం అభినందనీయమన్నారు. ఇందులో భాగంగా జీవో నెం-3 పునరుద్ధరణ, బొర్రాగుహలపై రెండవ లైన్ నిర్మాణంతో జరిగే ప్రమాదాలు, అరకు నుంచి పార్వతీపురం, పాడేరు మీదుగా భద్రాచలం కొత్త రైలు మార్గాల ఏర్పాటుతో పాటు అనేక గిరిజన సమస్యలను ప్రస్తావించడాన్ని కొనియాడారు. అరకులోయలో జరిగే ఐక్య క్రిస్మస్‌కు హాజరుకావాలని ఎంపీని పాస్టర్లు కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్‌ను సత్కరించారు. అరకులోయ యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ ప్రసాద్‌పాల్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ బి.ఈ.సంజీవ్‌కుమార్, పాస్టర్లు షడ్రక్, శామ్యూల్, జాన్‌ప్రకాష్, బాబూరావు, మదన్, గాసి, విజయ్, డానియేల్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



కాకివాడ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలంలోని కాకివాడ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన శనివారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బోధన, పాఠశాలలో సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించాలన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని సూచించారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ప్రణాళిక ప్రకారం ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ అమలుచేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

వినియోగదారులకు తప్పని అవస్థలు

పెట్రోల్ బంకులో నిలిచిపోయిన పంపింగ్



పెట్రోల్ బంకు వద్ద వాహనచోదకులు

సీలేరు: జీసీసీ సంస్థకు రోజు లక్షలాది రూపాయలు ఆదాయాన్ని ఇచ్చే సీలేరులో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకులో పంపింగ్ వ్యవస్థ నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీలేరు పెట్రోల్ బంకులో 4 పంపుల్లో ..2-పెట్రోల్, 2-డీజల్ పంపులు ఉన్నాయి. నాలుగు నెలలుగా రెండు పంపులు పనిచేయడం లేదు. దీంతో ప్రస్తుతం ఉన్న రెండింటితోనే కాలయాపన చేస్తున్నారు. దీంతో లోడ్ ఎక్కువగా పడడంతో తరచూ పంపింగ్ నిలిచిపోతోంది. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి పంపు పనిచేయ లేదు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విశాఖపట్నం నుంచి సీలేరు మీదుగా తెలంగాణ, ఒడిశా నుంచి ఆంధ్రా మీదుగా రాకపోకలు సాగించే వారితో పాటు ఈ బంకుపై ఆధారపడి సమీప ప్రాంతాల్లో వేల వాహనాలున్నాయి. ఆదివారం వారపు సంతకు కావడంతో వచ్చిన వాహనచోదకులు సైతం ఉదయం నుంచి బంకు పనిచేయకపోవడంతో గంటల తరబడి వేచి ఉండి నిరాశతో వెనుతిరిగారు. కొన్ని వాహనాలు పెట్రోల్ లేకపోవడంతో ఇక్కడే నిలిచిపోయాయి. పంపింగ్‌లో సాంకేతిక లోపం అయినప్పటికీ నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో ఇబ్బంది కలుగుతుందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై బంకు మేనేజర్ విజయకుమార్ మాట్లాడుతూ బంకు నిర్వాహక సంస్థ హెచ్‌పీసీఎల్ అధికారులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశామని, ఇప్పటివరకు రాలేదని, ఆదివారం ఉదయం నుంచి మరో పంపు కూడా పనిచేయలేదన్నారు. మంగళవారం మధ్యాహ్నంలోగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉషారాణి, గ్రామపెద్దలు

సాక్షి,పాడేరు: పట్టణంలోని పెట్రోల్ బంక్ సమీపంలోని ప్రధాన శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు అభివృద్ధికి పాడేరు మేజర్ పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకుంది. ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి శ్మశాన వాటిక మీదుగా బక్కలపనుకు వరకు సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు రోడ్డు పనులను సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ఆదివారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ పిన్నయ్యదొర, గ్రామపెద్దలు కొట్టగుళ్లి సుబ్బారావు, ట్యాక్సీ యూనియన్ అధ్యక్షుడు నాయుడు, వార్డు సభ్యులు గోపాలకృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు



డుంబ్రిగుడ శివారులో కురుస్తున్న మంచు



మంచులో చిన్నారులు

డుంబ్రిగుడ: మండలంలోని మంచు దట్టంగా కురుస్తోంది. ఆదివారం అరకు, జైపూర్ జంక్షన్ మొదలు కించుమండ వరకు మంచు కమ్ముకోవడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటలు దాటినా మంచుతెరలు వీడలేదు. నవంబర్ మొదటి వారం నుంచి మంచు అందాలను తిలకించడానికి పర్యాటకులు ఏజెన్సీకి తరలి వస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న మంచుతో చాపరాయి, సమీప జలపాతాలు, పర్యాటక ప్రాంతాలు మరింత అందాన్ని సంతరించుకున్నాయి. మన్యం అందాలను చూసి పర్యాటకులు ఆనందాన్ని పొందుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో కుట్ర రాజకీయాలు



ఉమామహేశ్వరి

మోతుగూడెం: మాజీ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జునపై జరిగిన కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి జెర్రి ఉమామహేశ్వరి అన్నారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి మెరుగు నాగార్జున రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించారన్నారు. నిబద్ధతతో పనిచేసి ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి, మంచి నాయకుడిగా పేరు పొందారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. పాలకపక్ష నాయకులు ఆడిస్తున్న నాటకమని చెప్పారు. ప్రజలు కూటమి ప్రభుత్వం కుట్ర రాజకీయాలను గమనిస్తున్నారని, గుణపాఠం చెబుతారన్నారు.